సాక్షి ప్రకాశం
గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



ఇంటి ముంగిటకే వైద్యం

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను ఇంటి ముంగిటకే చేర్చేందుకు ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ శ్రీదేవి అన్నారు.

- 8లో..



ఉద్యాన పంటలతో రైతులకు మేలు

ఉద్యానవన పంటలతో రైతులు లబ్ధిపొందవచ్చని కేంద్ర జల్‌శక్తి అభియాన్ డైరెక్టర్ మనోజ్ బాప్నా పేర్కొన్నారు. కొండపి నియోజకవర్గంలో ఆయన పర్యటించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35/27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'సాహితీ సౌరభం' గ్రంథావిష్కరణ

ఒంగోలు మెట్రో: డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్-1 పేరిట ఏర్పాటు చేసిన 'సాహితీ సౌరభం' గ్రంథాన్ని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ స్థానిక ఒంగోలులోని తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్య గ్రంథాన్ని రూపకల్పన చేసిన ఆంగ్రోప న్యాసకుడు డా.నూనె అంకమ్మరావును అభినందించారు. కార్యక్రమంలో డా.నూకతోటి రవికుమార్, బి.శ్రీరామ్ శర్మ, హరివరం మహేశ్వరాచారి, వి.శేష గిరిరావు, వెంకట్రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జెడ్పీలో ఏడుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతి

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్‌లో పరిపాలనాధికారి, ఈవోఆర్‌డీలుగా పనిచేస్తున్న ఏడుగురికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఉత్తర్వులను జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సీఈవో బి.జాలిరెడ్డి జారీ చేశారు. సీహెచ్ రూతమ్మ-బాపట్ల జిల్లా వేటపాలెం, కె.రాజశేఖరరావు-శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా లింగసముద్రం మండలాలకు బదిలీ చేశారు. మిగిలిన ఐదుగురిని ప్రకాశం జిల్లాలోని మండలాలకు బదిలీ చేశారు. ఎస్.ప్రసాదరావును పల్నాడు జిల్లా నుంచి కంభం, కె.లలితను బాపట్ల జిల్లా నుంచి హనుమంతునిపాడు, టి.పార్వతిని గుంటూరు నుంచి బేస్తవారిపేట, బి.శంకరరావును పల్నాడు నుంచి సంతనూతలపాడు, సీహెచ్ రామచంద్రరావును పల్నాడు నుంచి వెలిగండ్ల ఎంపీడీవోలుగా నియమించారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో శుక్రవారం నుంచి రాష్ట్ర స్థాయి అండర్-13 సబ్ జూనియర్ బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ లక్ష్మణ్‌రెడ్డి, పి.విజయకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేదలందరికీ సొంత గూడు కల్పించాలనే ధృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో చేర్చి అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇచ్చే నగదుకు తోడుగా డ్వాక్రా సంఘాల ద్వారా మరికొంత నగదు రుణంగా అందజేస్తున్నారు.
వాటికి తోడు లబ్ధిదారులు సొంత డబ్బు మరికొంత వెచ్చించి రెండు మూడు అంతస్తుల్లో అత్యంత సుందరంగా, సౌకర్యవంతంగా పక్కా భవనాలు నిర్మించుకుంటున్నారు. జగనన్న కాలనీల్లో వందల సంఖ్యలో ఇళ్లు అన్ని మౌలిక వసతులతో ఒకే చోట ఉండటంతో ఓ కొత్త ఊరులా దర్శనమిస్తూ కళకళలాడుతున్నాయి.



చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం జగనన్న కాలనీలోని ఇళ్లు

జిల్లాలో మంజూరైన ఇళ్లు:	73,993
వాటిలో పీఎంఏవై ద్వారా మంజూరైనవి:	7668
నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పీఐ) ద్వారా మంజూరైనవి:	66,325
అర్బన్ పరిధిలో ఇళ్లు:	11,476
రూరల్ పరిధిలో ఇళ్లు:	62,517



ఆరు గదుల స్థలంలో చూడచక్కని రెండంతస్తుల ఇల్లు


ఇళ్లు కాదు.. ఊళ్లు

- జగనన్న కాలనీల కళకళ
- ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతోపాటు సొంత డబ్బు కలిపి రెండు, మూడు అంతస్తుల భవనాల నిర్మాణాలు
- సకల సదుపాయాలతో అద్భుత నిర్మాణాలు
- త్వరలో ప్రారంభోత్సవానికి జిల్లాలో సిద్ధంగా 17,459 ఇళ్లు

చీమకుర్తి:

జగనన్న కాలనీల్లో ఇళ్ల యజమానులు అద్భుతాలనే సృష్టించారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు తోడు స్వయం సహాయక సంఘాల ద్వారా ఇచ్చే రుణం, స్వంతంగా కొంత డబ్బులు కలుపుకొని రెండు మూడు అంతస్తుల భవనాలు నిర్మించారు. వాటిలో బెడ్ రూమ్, కిచెన్, హాలు, వాష్‌రూము, ఇంటిపైకి మెట్లతో ఆధునిక వసతులన్నీ ఏర్పాటు చేసుకున్నారు. గత నెల 18న కలెక్టర్ దినేష్‌కుమార్ చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కేవీ పాలెం లేఅవుట్‌ను పరిశీలించి జిల్లాలోనే మోడల్ కాలనీగా ఉందని ప్రశంసలు కురిపించారు. కేవీ పాలెం లేఅవుట్‌లో 543 ఇళ్లు మంజూరు కాగా వాటిలో దాదాపు 100 ఇళ్ల వరకు రెండంతస్తుల భవనాలు నిర్మించుకున్నారంటే లబ్ధిదారులు ఎంతటి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారో స్పష్టమవుతోంది. జగనన్న కాలనీలో నిర్మించుకున్న ఇళ్లల్లో స్వయం ఉపాధి అవకాశాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. చిల్లర దుకాణాలు, చిరు వ్యాపారాలను ప్రారంభించి ఉపాధి మార్గాలను ఏర్పాటు చేసుకుంటూ జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న వారికి కావాల్సిన సరుకులు అందిస్తూ ఒక ఊరును తలపించేలా ఏర్పాటైంది. కేవీ పాలెం జగనన్న కాలనీలో 543 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగానే దానికి ఆనుకొని చీమకుర్తి-కేవీ పాలెం వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఎకరం పొలం గతంలో రూ.15 - రూ.20 లక్షలు ఉండేది. ఇప్పుడు అక్షరాలా రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల వరకు పెరిగాయంటే జగనన్న కాలనీ పరిసరాల్లో భూముల ధరలు పెరగటానికి దోహదపడ్డాయి. దాదాపు 25 ఎకరాల్లో ప్లాట్లు కూడా వేసి రియల్ ఎస్టేట్ వెంచర్‌లు కూడా వెలిశాయి. కలెక్టర్ సందర్శన సమయంలో జగనన్న కాలనీకి సమీపంలో ఏర్పాటైన రియల్ వెంచర్‌లను చూసి కాలనీలు ఎంతో అభివృద్ధికి కారణమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాలో 73,993 ఇళ్లు మంజూరు:
జిల్లాలో పీఎంఏవై, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు(ఎన్‌పీఐ) పథకాల ద్వారా మొత్తం 73,993 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో పీఎంఏవై ద్వారా 7,668 ఇళ్లు, ఎన్‌పీఐ ద్వారా 66,325 ఇళ్లు మంజూరయ్యాయి. మంజూరైన ఇళ్లలో చీమకుర్తి, గిద్దలూరు, దర్శి, కనిగిరి, మార్కాపురం, ఒంగోలుకు చెందిన అర్బన్ ప్రాంతాల్లో 11,476 ఇళ్లు మంజూరు కాగా రూరల్ మండలాల్లో 62,517 ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చొప్పున 73,993 ఇళ్లకు కలిపి రూ.1331 కోట్ల విలువైన జగనన్న కాలనీలను ప్రభుత్వం నిర్మించడంపై ఇళ్ల లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జగనన్న కాలనీలను చూస్తే ఊళ్లకు ఊళ్లే నూతనంగా ఏర్పాటు కావడంతో ప్రతి మండలంలో గ్రామాల సంఖ్య పెరిగాయి. జగనన్న కాలనీలకు ప్రత్యేకంగా ఆర్చి నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో నూతన గృహాలు, వ్యాపారాలతో నూతన శోభను సంతరించుకున్నాయి.



కేవీ పాలెం జగనన్న కాలనీకి సిద్ధమవుతున్న ఎంట్రెన్స్ ఆర్చి



చూడచక్కని రెండంతస్థుల ఇల్లు



చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం జగనన్న కాలనీని పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్(ఫైల్)

ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న 17,459 ఇళ్లు:
జిల్లా వ్యాప్తంగా రూ.1331 కోట్ల విలువ చేసే ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఒంగోలులో కోర్టు కేసుల కారణంగా 15,270 ఇళ్ల నిర్మాణాలకు సాంకేతిక కారణాల వలన జాప్యం జరుగుతోంది. మిగిలిన వాటిలో బీబీఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) 3,226 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. బీఎల్(బేస్‌మెంట్ లెవల్) స్థాయిలో 10,572 ఇళ్లు, రూఫ్ లెవల్‌లో 2,750 ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయి. నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా 17,459 ఇళ్లు ఉన్నాయి. వాటిని వాస్తవానికి గత నెల 30వ తేదీన జిల్లా వ్యాప్తంగా చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం లేఅవుట్‌లో ప్రారంభించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కేవీ పాలెం లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్న కారణంగా ఎంట్రెన్స్ ఆర్చి నిర్మాణం కూడా ఆగమేఘాలపై త్వరగా పూర్తి చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనివార్య కారణాల వలన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడటంతో జిల్లాలో కూడా ప్రారంభోత్సవం వాయిదా పడింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి రాగానే రాష్ట్రంలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి తేదీని ఈనెలలోనే ప్రారంభించేందుకు నిర్ణయించవచ్చని హౌసింగ్ జిల్లా అధికారులు సూచనప్రాయంగా వ్యక్తం చేస్తున్నారు. తేదీ నిర్ణయించగానే జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లోని 17,459 ఇళ్లు ఒకేసారి ప్రారంభంకానున్నాయి.

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలను త్వరలో ప్రారంభిస్తాం

జిల్లాలో పీఎంఏవై, ఎన్‌పీఐ ద్వారా 73,993 ఇళ్లు మంజూరు కాగా వాటిలో నిర్మాణాలు పూర్తయినవి 17,459 ఇళ్లు ఉన్నాయి. వాటిని వాస్తవానికి గత నెల 30న జిల్లా వ్యాప్తంగా ప్రారంభించాల్సి ఉంది. అనివార్య కారణాల వలన ఆ కార్యక్రమం వాయిదా పడింది. ప్రభుత్వం మళ్లీ తేదీ నిర్ణయించగానే కలెక్టర్ ఆదేశాల మేరకు దాదాపు ఈ నెలలోనే ప్రారంభోత్సవం చేసే అవకాశం ఉంది.

– పేరయ్య, హౌసింగ్ పీడీ, ఒంగోలు

కి'లేడీ' ముఠా

- ఒంటరి మహిళలే టార్గెట్‌గా దొంగతనాలు
- నేను ఎవరనుకుంటున్నారు అంటూ మార్గదర్శి మేనేజర్ భార్య రచ్చ
- పెళ్లూరు, పొదిలి, దొనకొండల్లోనూ ఇదే తరహాలో చోరీలకు పాల్పడిన కి'లేడీ'లు



సీసీ కెమెరాల్లో చిక్కిన కి'లేడీ' ముఠా

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో ఒక బ్యూటీషియన్ ఇంట్లో మంగళవారం ఉదయం జరిగిన చోరీ ఎంతగా కలకలం రేపిందో ఆ చోరీలో ప్రముఖ వ్యక్తుల భార్యలు నిందితులుగా పోలీసులకు దొరకడం కూడా అంతే సంచలనం సృష్టించింది. స్థానికంగా శ్రీకృష్ణ నగర్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహించే షేక్ రజియా మీద దాడి చేసి ముగ్గురు మహిళలు పట్టపగలే చోరీకి పాల్పడడం తెలిసిందే. దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు అందుకున్న ఎస్పీ మలికా గర్గ్ తక్షణమే స్పందించి పోలీసులను అప్రమత్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన తాలూకా పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించిన వారికి కీలక సమాచారం లభ్యమైంది. తీగలాగితే డొంక కదిలింది. నగరంలోని ముంగమూరు రోడ్డులో ధనవంతులు నివశించే మైటీ హోం అపార్ట్‌మెంట్, దానికి కొద్ది సమీపంలోని ఐక్య అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకున్న పోలీసులను చూసి అక్కడి జనం ఆశ్చర్యపోయారు. సరాసరి ఒంగోలు మార్గదర్శి మేనేజర్ కరణం నాగేశ్వరరావు ఫ్లాట్ వద్దకు వెళ్లిన పోలీసులు ఈ కేసులో నిందితురాలైన కరణం మోహన దీప్తిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే మిగిలిన నిందితులు ముంద్రు లక్ష్మీ నవత, రిటైర్డ్ ఏఎస్సై కోడలు అలహరి అపర్ణ, దాసరి భాను ఉరఫ్ సాహేర భానును కూడా అదుపులోకి తీసుకున్నారు.

స్నేహితురాలే సమాచారం ఇచ్చింది...
బ్యూటీషియన్ రజియాకు రాజీవ్ నగర్‌లో నివశించే దాసరి భాను ఉరఫ్ షేక్ సాహెర భాను మంచి స్నేహితురాలు. తరచుగా ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకునేవాళ్లు. మంచి, చెడ్డ మాట్లాడుకునేవాళ్లు. అయితే రజియా వద్ద లక్షల విలువ చేసే బంగారం ఉన్న విషయాన్ని గ్రహించిన భానుకు కన్నుకుట్టింది. అదే సమయంలో భానుకు కిలాడీ ముఠాతో కూడా బాగా పరిచయం ఉంది. వారి చేతివాటం గురించి కూడా ఆమెకు తెలుసు. రజియా వద్ద ఉన్న బంగారం, ఆమె ఒంటరిగా ఉండే సమయం గురించి వారికి సమాచారం ఇచ్చింది. అసలే దొంగతనాలకు అలవాటు పడిన ప్రాణాలు కదా.. వెంటనే రంగంలోకి దిగారు. పట్టపగలే దొంగతనానికి తెగబడ్డారు.

రెక్కీ చేసి మరీ దొంగతనం...
బ్యూటీషియన్ రజియా ఇంట్లో దొంగతనానికి పాల్పడటానికి ముందు ఈ కిలాడీ ముఠా రెక్కీ కూడా నిర్వహించినట్లు సమాచారం. రజియా ఇంటి పరిసరాలు, ఇంటి చుట్టు పక్కల వాతావరణాన్ని కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. అప్పటికే ఒకటికి రెండుసార్లు చోరీలు చేసి ఉండడంతో చేయి తిరిగిన దొంగల్లా చోరీకి పాల్పడ్డారు. ఒక వేళ ఏదైనా ప్రతిఘటన జరిగితే ఎదుర్కొనేందుకు వెంట క్లోరోఫాం స్ప్రే చేసిన రుమాలును, యాసిడ్ లాంటి ద్రావణాన్ని తెచ్చుకున్నారు. అయితే చోరీ సమయంలో రజియా తిరగబడటంతో ఆగ్రహానికి గురైన ఈ ముఠాలోని ఒక మహిళ బూతులు తిడుతూ వెనుక నుంచి గట్టిగా నోరు మూసేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా రజియాను బలవంతంగా యాసిడ్ తాగించే ప్రయత్నం చేయడం గమనిస్తే వీరు ఎంత క్రూరంగా ఉన్నారో అర్థమవుతుంది.

రచ్చ చేసిన దీప్తి...

బ్యూటీషియన్ మీద దాడి చేసి చోరీకి పాల్పడిన కరణం మోహన దీప్తి పోలీసుల ఎదుట రచ్చ చేసినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాలలో లభ్యమైన చిత్రాలు, ఇతర పక్కా సమాచారంతో ఐక్య అపార్ట్‌మెంటుకు వెళ్లిన పోలీసులతో తొలుత ఆమె వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. మీరు ఎవరి ఇంటికి వచ్చారు..నేను ఎవరనుకుంటున్నారు... మార్గదర్శి మేనేజర్ భార్యను... అంటూ రెచ్చిపోయినట్లు తెలుస్తోంది. పోలీసుల వద్ద ఉన్న సాక్ష్యాలు చూసిన తరువాత కిమ్మనకుండా పోలీసు వ్యాన్ ఎక్కినట్లు ప్రచారం జరుగుతోంది.

ఒంటరి మహిళలే టార్గెట్...
ఈ ముగ్గురు దొంగల ముఠా గతంలోనూ అనేక దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో అంగీకరించారు. వీరి మీద 2012లో పెళ్లూరు గ్రామంలో జరిగిన ఒక దొంగతనం కేసు నమోదైంది. ఒక అపార్ట్‌మెంటులో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఫ్లాటులో చోరీకి పాల్పడ్డారు. అలాగే పొదిలి, దొనకొండల్లో కూడా వీరు దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల ముందు అంగీకరించారు. ఒంటరి మహిళలను, వృద్ధులను టార్గెట్ చేసిన ఈ కిలేడి ముఠా ఇంకా ఎన్ని దొంగతనాలకు పాల్పడ్డారో మొత్తం విచారణ జరిగితే తెలుస్తుంది. ప్రస్తుతం పోలీసులు అదే పనిలో ఉన్నారు. ఈ ముగ్గురి నేరాల చిట్టా తేల్చేందుకు విచారణ చేపట్టారు. గతంలో రుణాలు తీసుకోవడం, తక్కువ వడ్డీలు అంటూ అనేక మందిని మోసం చేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. కొంతమంది యువకులు కూడా వీరితో కలిసి చోరీలకు పాల్పడుతున్నారని సమాచారం. ఈ ముగ్గురు మహిళల్లో ఒకరి భర్త దగ్గర పనిచేసే యువకులను చేరదీసినట్లు సమాచారం.

23న ఇగ్నైట్ యంగ్ మైండ్స్ జిల్లా స్థాయి పోటీలు



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మౌలాలీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ

- సమీక్షించిన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈనెల 23వ తేదీ ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో బుధవారం జిల్లా స్థాయి పోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు కృషిచేయాలని సూచించారు. విధి విధానాలను త్వరగా రూపొందించాలని, విజేతలకు మెమొంటోలు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందిస్తారన్నారు. జిల్లాలో అన్నీ ప్రభుత్వ, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్ ఈ పోటీల్లో పాల్గొనేలా కృషిచేయాలన్నారు. జిల్లాలోని అన్నీ పాఠశాలలకు పాంప్లేట్లు పంపించాలని, పోటీల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మౌలాలిని సన్మానించారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల ఎంఈఓలు టీ శ్రీనివాసులు, ఏ సుబ్బారావు, ఎస్పీ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలు చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ మల్లికార్జున్, మెంబర్లు మండ్లా రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్, సత్యనారాయణ, చైతన్య కుమార్, తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన



అనుమలవీడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమైందని, కుల, మతం తేడా లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని అనుమలవీడులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనుమలవీడులోని వైఎస్సార్ సీపీ నాయకులు యాపిల్ పండ్లతో భారీ గజమాలను క్రేన్ సాయంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు విస్తృతంగా పర్యటిస్తూ వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామంలో సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ పాలనకు ఈ నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ అందించిన పాలనకు తేడాను గమనించాలని సూచించారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మొద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అన్నా కోరారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, పాలకవీడు సర్పంచ్ షేక్ పల్నాటి లతీఫ్, మాజీ జెడ్పీటీసీ బద్దెటి నాగరత్నం, బద్దెటి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ కొర్విపాటి నాయబ్ రసూల్, మాజీ ఎంపీటీసీ చప్పిడి శ్రీనివాసరావు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు పల్నాటి మహబుబ్ పీరా నెమలిగుండ్ల రంగ నాయకస్వామి ఆలయ చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, జేఏసీ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఇబ్రహీం, పగడాల శ్రీరంగం, సూర పాండురంగారెడ్డి, చిట్టెం మార్క్, షేక్ పల్నాటి సుభాహన్ పాల్గొన్నారు.

కృష్ణా..ముకుందా

కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా బుధవారం జిల్లాలోని పలు ఆలయాలు, విద్యా సంస్థల్లో వేడుకలు నిర్వహించారు. పాఠశాలల్లో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలతో చిన్నారులు అలరించారు. పలుచోట్ల ఉట్టికొట్టి సంబరాలు చేసుకున్నారు. గోపూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ మందిరాలు అన్నీ భక్తులతో కిటకిటలాడాయి. - సాక్షి నెట్‌వర్క్



మార్కాపురంలోని ఓ పాఠశాలలో ఉట్టికొడుతున్న చిన్నారులు



పామూరులో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



కురిచేడులో గోపూజ చేస్తున్న మహిళలు



ఒంగోలు ఐశ్వర్యనగర్‌లోని మురళీకృష్ణ మందిరంలో స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు

క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ రెండో సెమిస్టర్ మూల్యాంకనం

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ప్రారంభమవుతుందని క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ డి.కళ్యాణి పేర్కొన్నారు. సాయంత్రం 2 గంటల నుంచి 7 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ అన్ని గ్రూపుల పేపర్లు, బీఏ ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, బీకాం అన్ని సబ్జెక్టుల పేపర్లు మూల్యాంకన కేంద్రానికి చేరాయని వివరించారు. చీరాల, మార్కాపురం, ఒంగోలులోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కాలేజీల అధ్యాపకులు రిలీవ్ తీసుకుని మూల్యాంకనానికి హాజరుకావాలని సూచించారు.

మద్యం మాల్ సిబ్బందిపై దాడి


దుకాణంలో మద్యం సీసాల పెంకులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం మాల్ సిబ్బందిపై బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు మద్యం కొనుగోలు చేసేందుకు దుకాణానికి వచ్చారు. డిజిటల్ పేమెంట్ విషయంలో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మాటా మాటా పెరగడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు పక్కనే కౌంటర్ టేబుల్‌పై ఉంచిన మూడు ఫుల్ బాటిళ్లను దుకాణం సిబ్బందిపై బలంగా విసిరికొట్టారు. ఈ క్రమంలో కంప్యూటర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మద్యం సీసాలతో దాడికి పాల్పడిన యువకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు మాల్ సిబ్బంది ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన రాజయ్య

బేస్తవారిపేట: మండలంలోని ఒందుట్ల సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గిద్దలూరు మండలంలోని తంబళ్లపల్లెకు చెందిన కటారు రాజయ్య అర్ధవీడు మండలం కాకర్లలో ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు మోటారుసైకిల్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో బేస్తవారిపేట నుంచి పందిళ్లపల్లె జెడ్పీ హైస్కూల్‌కు కారులో వెళ్తున్న హెచ్ఎం పద్మావతి ఢీకొట్టింది. దీంతో రాజయ్య కాలు, చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై బి.నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఓ ప్రైవేట్ వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


అభిషేకాలకు సిద్ధం చేసిన అమ్మవారి మూలవిరాట్, వివిధ దేవతా మూర్తుల విగ్రహాలు, కలశాలు


అమ్మవారికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కనులపండువగా అమ్మవారి ఉత్సవాలు

- యాగశాలలో వేదమంత్రోచ్ఛరణల మధ్య చండీహోమం
- ఉత్సవాలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా జరుగుతున్న ఉత్సవాలు కనులపండుగగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 3వ రోజైన బుధవారం అమ్మవారికి క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం వంటి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో వేదమంత్రోచ్ఛరణల మధ్య చండీహోమం నిర్వహించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అమ్మవారి అభిషేక పూజల్లో పాల్గొని పూజలు చేశారు. అలాగే అమ్మవారి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

అంకమ్మతల్లి నూతన ఆలయం ప్రారంభోత్సవంతో పాటు, అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ఉదయం 10.47 నుంచి 1.30 గంటల మధ్య జరగనుంది. ఈ వేడుకకు ఇప్పటికే పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణతో పాటు, జిల్లాలోని ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను ఆహ్వానించారు. పలువురు వీఐపీలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పెద్ద ఎత్తున చేస్తున్నారు. అలాగే ఈ వేడుకను తిలకించేందుకు దాదాపు 20 వేల మంది భక్తులకు హాజరవుతారని, వారందరికి అమ్మవారి ప్రసాదం కింద అన్నదానం ఉంటుందని ఇప్పటికే కమిటీ సభ్యులు ప్రకటించి ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆలయంతో పాటు, ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపకాంతులతో అత్యద్భుతంగా అలంకరించారు.


అమ్మవారి ధాన్యాధివాసంలో పాల్గొన్న భక్తులు

ప్రతి ఒక్కరూ తరలిరండి

అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి స్వయంగా విజ్ఞప్తి చేశారు. అమ్మవారి దేవాలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలతో పాటు, బంధుమిత్రులు, నియోజకవర్గంలో అమ్మవారి భక్తులు వేడుకకు హాజరై అమ్మవారి దర్శించుకోవాలని పిలుపునిచ్చారు.


అభిషేకంలో పాల్గొనేందుకు ఆలయం వద్ద బారులు తీరిన మహిళలు

9 నుంచి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్

- ప్రోమో ఆవిష్కరించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: నేషనల్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్–23 ప్రోమోను ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ నిర్వాహకుడు డాక్టర్ కె.దీపక్ మాట్లాడుతూ.. ఈనెల 9, 10వ తేదీల్లో ఒంగోలులోని గాంధీ పార్కులో నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా అథ్లెట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు.


ప్రోమో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఇంటి ముంగిటకే ప్రభుత్వ వైద్యం


ఏలూరులో ఫ్యామిలీ డాక్టర్స్ బృందం

పొదిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను ఇంటి ముంగిటకే చేర్చి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పొదిలి మండలంలోని ఏలూరు, టి.సల్లూరు, నల్లారెడ్డిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్స్, వైద్య కళాశాల బృందం సంయుక్తంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యంతో అవస్థలు పడుతున్న రోగి ఇంటి వద్దకే నాణ్యమైన ప్రభుత్వ వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 67 రకాల మందులు, 14 రకాల రక్త పరీక్షలు నిత్యం అందుబాటులో ఉంటాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఎలా సాగుతోంది, ప్రజలకు సేవలు అందుతున్న తీరుపై జిల్లాలో 4 రోజులపాటు సర్వే చేస్తున్నట్లు చెప్పారు.


ఇంటింటి సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఇప్పటి వరకు మద్దిపాడు మండలం వెల్లంపల్లి గ్రామంలో ఎఫ్‌డీపీ సర్వే చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1063 గృహాలను సందర్శించి, 3,147 మంది నుంచి వివరాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, ఉప్పలపాడు, కాకర్ల వైద్యాధికారులు టి.సుష్మ, కీర్తిశ్రీ, రవిశంకర్, విజయలక్ష్మి, మెరీనా, శ్రీనివాసరెడ్డి, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో రైతులకు మేలు

- కేంద్ర జల్ శక్తి అభియాన్ డైరెక్టర్ మనోజ్ బాప్నా

టంగుటూరు/జరుగుమల్లి: ఉద్యానవన పంటలతో రైతులు లబ్ధి పొందవచ్చని కేంద్ర జల్ శక్తి అభియాన్ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ మనోజ్ బాప్నా పేర్కొన్నారు. ఉద్యాన పంటల పరిశీలనలో భాగంగా టంగుటూరు మండలంలోని జయవరం, కారుమంచి గ్రామాల్లో మనోజ్ బాప్నా బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా రైతులు, కేంద్ర ప్రభుత్వ బృందంతో కలిసి ఎంఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న మామిడి తోటలను సందర్శించారు. ఈ పథకం వల్ల రైతులకు ఎంత లబ్ధి కలుగుతుందో వివరించి, సలహాలు సూచనలు ఇచ్చారు.

నేతివారికుంట పరిశీలన

జరుగుమల్లి మండలంలోని చింతలపాలెం గ్రామంలో అమృత్ సరోవర్ పథకం కింద రూ.6 లక్షలతో అభివృద్ధి చేసిన నేతివారికుంటను కేంద్ర విజిలెన్స్ అధికారుల బృందం పరిశీలించింది. కుంట పనులు సక్రమంగా నిర్వర్తించడంపై విజిలెన్స్ బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. నేతివారికుంటను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ టీమ్ నోడల్ ఆఫీసర్ మనోజ్ బాప్నా సూచించారు. ఆయా కార్యక్రమాల్లో టెక్నికల్ ఆఫీసర్ పి.యాదయ్య, డ్వామా పీడీ కె.శీనారెడ్డి, ఏపీడీ వెంకటస్వామి, టంగుటూరు ఎంపీడీఓ రత్నజ్యోతి, జరుగుమల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ నాగరాజు, సర్పంచ్ హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మేదరమిట్ల భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చింతలపాలెంలో నేతివారికుంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం


జయవరంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న మనోజ్ బాప్నా తదితరులు

HIGH COURT OF ANDHRA PRADESH :: AT AMARAVATI
I.A. No. 2 of 2023 in S.A No. 1715 of 2018

Between:
Burka Anka Raju S/o. Venkateswaralu
Aged about 44 Years, Hindu, Occ : Cultivation,
R/o Konejedu Village, Tangutur Mandal, Praksam District.
... **Petitioner / Appellant**
And
Kolli Ankamma (Died) and others. ... Respondents

In the S.A.No. 1715 of 2018, on 14-12-2018, The Hon'ble Court was pleased to order Personal Notice to you i.e., the respodent No 9 i.e., Punugumati Chenchu Ramaiah and posted the case on 18-12-2018 as per order of the Hon'ble High Court, the previous counsel sent personal notice to the respondent No.9, i.c., **Punugumati Chenchu Ramaiah, S/o. Chinnabbi, Aged about 46 Years, Hindu, Occ : RTC Driver, R/o Rajiv Nagar, II lane, Ongole. Praksam District.** and same is returned unserved earlier with endorsement "Insufficient Address" Again on 03-11-2022, the Hon'ble High Court was pleased to order personal notice to Respondent No.9 in I.A.No. 1 of 2022 in S.A.No. 1715 of 2018 and posted the matter after 4 weeks. As per order of the Hon'ble High Court, I sent personal notice to Respondent No.9 on 23-11-2022 and the same is returned with endorsement "He was present in Bangalore, Hence return, I send". The petitioner /Appellant filed I.A. 1 of 2023 in S.A.No. 1715 of 2018 seeking permission substituted service by publication in daily local newspaper Vishalaandhra or any newspaper in Prakasam District against Respondent No.9 i.e., Punugumati Chenchu Ramaiah. The Hon'ble High Court was pleased to permit me to take out substituted service in Sakshi Telugu daily newspaper in Prakasam District edition and the same is listed on 20-04-2023 and later posted on 11-05-2023 on my request. As per order, the petitioner supposed to publish the same before 20-04-2023 and to file the proof of publication on or before 20-04-2023 before the Hon'ble High Court, but got published on 11-05-2023. Hence, I filed I.A.No.2 of 2023 in S.A.No.1715 of 2018 before the Hon'ble High Court. On 21-08-2023, the Hon'ble High Court was pleased to allow the same and permitted to issue notice to Respondent No.9 by giving paper publication in I.A.No. 1 of 2022 in S.A.No. 1715 of 2018 in Sakshi Newspaper or any newspaper in Prakasam District and the case is posted on 18-09-2023 and put your appcarance either by you or through an advocate in the above said case, else the case will be heard and decided on merits.

PENJURI VENUGOPAL, Advocate-High Court Counsel for Appellant. Cell:9949697763

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
DISTRICT OFFICE, PRAKASAM.
EMPLOYMENT NOTIFICATION

No. Paddy/Admin/01/Manpower/PKM/KMS 2023-24 Date : 05.09.2023

Applications are invited to recruit personnel in the cadre of Technical Assistants, Data Entry Operators and Helpers on contract basis for a period of 02 months through District Selection Committee headed by the Joint Collector, Prakasam District, Ongole to utilize the services for paddy procurement for KMS 2023-24 season.

S.I.No	Post	No.of Posts	Eligibility Criteria
1	Technical Assistants	25	Should have a bachelor's degree in Agriculture/ Microbiology/ Biochemistry/ Biotechnology / BZC (Botany Zoology Chemistry) /Any Bachelor's Degree in Life Science / Diploma in Agriculture
2	Data Entry Operator	25	Should have bachelor's degree in any field. Should have Good Computer Knowledge. Post Graduate Diploma in Computer Application would be an advantage
3	Helpers	25	Should Possess 8th Class-10th Class

Age Limit

S.No	Post	Age Limit		
		Min.	Max.	Max. for BC/SC/ST
1	Technical Assistants	21	40	45
2	Data Entry Oprator	21	40	45
3	Helpers	18	35	40

Remuneration: The remuneration to the manpower has to be paid as per the existing Norms.

Applications for the post of Technical Assistants, Data Entry Operators, Helpers and selection procedure are available in http//prakasam.ap.gov.in/notice/recruitment website. Applicants should apply in the prescribed format as per the notification by enclosing relevant attested copies of certificates and send applications by Register Post or in person on or before 5.00 PM on 21.09.2023 to the address of District Civil Supplies Manager, Andhra Pradesh State Civil Supplies Corporation, Santhapeta, Ongole.

Sd/- **Dr. K. Sreenivasulu,** I.A.S.,
JOINT COLLECTOR & E.O.E.D.,
APSCSCL, PRAKASAM

విమర్శలకూ ఓ హద్దుండాలి

- రాజకీయాలకు అతీతంగా బాలినేనిపై ప్రజాభిమానం
- కులమతాలు చూడకుండా సేవలందించడం బాలినేని గుణం
- ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ సూర్యనారాయణ

ఒంగోలు: రాజకీయ నేతలపై విమర్శలకు ఓ హద్దుండాలని, వ్యక్తిత్వంపై దాడి చేసేలా వ్యవహరించడం సరికాదని టీడీపీ నేతలకు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ హితవు పలికారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆపద సమయంలో తనను ఆశ్రయించిన వ్యక్తులకు అండగా నిలిచిన వ్యక్తి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అని అన్నారు. ఒంగోలుకు రిమ్స్ ఆస్పత్రిని తీసుకురావడమే కాకుండా నేడు అందులో ఎన్నో ఆధునిక సేవలు ప్రజలు పొందగలుగుతున్నారంటే అందుకు బాలినేని ముందుచూపే కారణమన్నారు. ఒంగోలులో ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. రాజీవ్ నగరబాటలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించడం వల్లే ఒంగోలులో నేడు కొంతవరకైనా తాగునీటి సమస్యను ఎదుర్కోగలుగుతున్నామన్నారు. నగరంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఇటీవల అమృత్ పథకం కింద రూ.339 కోట్ల నిధులు తెప్పించారన్నారు. ఆ నిధులతో 18 ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల మార్పిడి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా రోజూ మంచినీరు విడుదల చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా సీఎం సంక్షేమాన్ని కొనసాగిస్తున్నట్లుగానే బాలినేని కూడా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటున్నారన్నారు. కరోన సమయంలో ప్రజలను బాలినేని చేసిన సేవలతో పేదలకు ఆప్తమిత్రునిలా మారారన్నారు. చివరకు ప్రతిపక్ష నేతలైన పవన్‌కళ్యాణ్, లోకేష్ సైతం బాలినేనిని విమర్శించకపోవడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. స్థాయి మరిచి బాలినేనిపై విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ మాట్లాడుతూ.. 24వ డివిజన్‌లో అభివృద్ధి జరగలేదని కొందరు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. డివిజన్ పరిధిలో రూ.5 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరికొన్ని పనులు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆగిపోయిన షాదీఖానాకు రూ.1.25 కోట్లు, చేపల మార్కెట్‌కు రూ.40 లక్షలు, జంతు వధశాలకు రూ.40 లక్షలు, దాని ముందు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.1.25 కోట్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజీకి రూ.10 లక్షలు కేటాయించి పనులు చేస్తున్నామని, ఏకలవ్యనగర్ వాసుల విజ్ఞప్తి మేరకు ఆర్చి నిర్మిస్తున్నామని, వంటవారి కాలనీలో పూర్తి చేసిన రోడ్డును త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నూతన కూరగాయల మార్కెట్ రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డును పూర్తి చేశామన్నారు. కూరగాయల మార్కెట్‌లో తాగునీటికి ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు, అద్దంకి బస్టాండు నుంచి కూరగాయల మార్కెట్ వరకు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణం, రూ.25లక్షలతో అక్కడే మరో రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బేతంశెట్టి హరిబాబు పాల్గొన్నారు.

225 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన లారీతో అధికారులు

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న 225 బస్తాల రేషన్ బియ్యం లారీని స్థానిక కొండపి ఫ్లయ్‌ఓవర్ వద్ద జాతీయ రహదారిపై సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకుని బుధవారం సింగరాయకొండ రేషన్ గోడౌన్‌కు తరలించారు. ఒంగోలు నుంచి సింగరాయకొండ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని లారీలో తరలిస్తున్నట్లు సమాచారం మేరకు టంగుటూరు సమీపంలో తనిఖీలు చేపట్టారు. కొండపి ఫ్లయ్‌ఓవర్ వద్ద ఓ లారీలో 225 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీతోపాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. తనిఖీలో రేషన్ డీటీ ఆర్వీఎస్ కృష్ణమోహన్, సీహెచ్ కృష్ణమోహన్, డేవిడ్‌రాజు, ముస్తాక్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మల్లికార్జున్ మృతదేహం

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి బీసీ కాలనీలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. నల్లబోతుల మల్లికార్జున్ (28) మద్యానికి బానిసై రోజూ భార్య భారతిని డబ్బులివ్వాలని వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతునికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్సై

సింగరాయకొండ: యువకులు రెండు వర్గాలుగా విడిపోయి దాడి చేసుకున్న ఘటనలో పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. స్థానికుల కథనం ప్రకారం..మంగళవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో కొందరు యువకులు ఒక యువకుడిపై దాడి చేశారు. దీంతో ఆ యువకుడి స్నేహితులు బుధవారం దాడికి పాల్పడిన వ్యక్తిని మూలగుంటపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద ఉన్న జిమ్‌లో ఉండగా దాడి చేశారు. ఆ సమయంలో జిమ్ చేస్తున్న వ్యక్తి తన చేతిలో ఉన్న వస్తువులతో తనపై దాడికి పాల్పడిన యువకులను కొట్టడంతో కొంత మందికి తలకు గాయాలయ్యాయి. యువకునిపై దాడి విషయం తెలుసుకున్న అతని స్నేహితులు కూడా రావడంతో ఆ ప్రాంతంలో యుద్ధ వాతావరణం ఏర్పడింది. విషయం తెలిసిన ఏఎస్సైలు షేక్ మహబూబ్‌భాషా, షేక్ మహబూబ్‌బేగ్ సంఘటనా స్థలానికి వెళ్లారు. దాడికి పాల్పడిన ఇరువర్గాల యువకులకు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారు. రెండు వర్గాల వారు తగ్గకపోవడంతో చివరికి సీఐ దాచేపల్లి రంగనాథ్ వద్ద హాజరుపరిచారు. యువకులకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి సర్దిచెప్పి పంపించారు. యువకుల మధ్య ఘర్షణకు కారణం ప్రేమ వ్యవహారమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. పోలీసులు సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని లేదంటే రెండు కులాల మధ్య ఘర్షణకు దారితీసేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.